31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
ఆదివారం 22 మార్చి 2026 | పేజీలు : 8

### రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన
# మంత్రి డాక్టర్ వివేక్

చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 21. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ముస్లిం సోదరులకు రంజాన్ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.రంజాన్ పండుగ సందర్భంగా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సీనియర్ ముస్లిం సోదరుల నివాసాలకు వెళ్లి, వారికి మరియు వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రివర్యులు జి. వివేక్ వెంకటస్వామి ఈద్ ముబారక్ శు



భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ రంజాన్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పవిత్ర పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఐశ్వర్యం నింపాలని, సమాజంలో ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కు

**-ఏ విధమైన నిర్ణయం తీసుకోవద్దని కోరాం**
**-జీవన్ రెడ్డికి పార్టీ అండగా నిలబడే ఆలోచన చేస్తుంది**
**-రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**-జీవన్ రెడ్డితో చర్చించిన మంత్రులు శ్రీధర్ బాబు అడ్లూరి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 21 :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి పెద్దదిక్కు అని, ఆయనను ఏ విధమైన నిర్ణయం తీసుకోవద్దని కోరామని, జీవన్ రెడ్డికి పార్టీ అండగా నిలబడే ఆలోచన చేస్తుందని రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జీవన్ రెడ్డి నివాసంలో జీవన్రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలు సమావేశమయ్యారు. వారు జీవన్ రెడ్డితో పలు అంశాలపై చర్చించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏ విధమైన నిర్ణయం తీసుకోవద్దని జీవన్ రెడ్డిని కోరామని, జీవన్ రెడ్డికి పార్టీ అండగా నిలబడే ఆలోచన చేస్తుందన్నారు. జీవన్ రెడ్డితో చర్చించిన అంశాలను పార్టీ పెద్దలు, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని, ఈ ప్రాంతానికి జీవన్ రెడ్డి ఒక పెద్దదిక్కు అని, అభివృద్ధి కోసమే 10 మంది ఎమ్మెల్యేలను



తీసుకున్నామన్నారు. జీవన్ రెడ్డి గురించి తెలంగాణ రాష్ట్రం లో తెలియని వారు ఎవరు ఉండరని, ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రజల ప్రశ్నించే గొంతుకగా తన వాణిని అసెంబ్లీ, శాసనమండలిలో విన్పించారన్నారు. జీవన్ రెడ్డి బాధపడితే తాము బాధపడినట్లేనని, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లు జీవన్ రెడ్డి తో గతంలో మాట్లాడారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదురుకొంటున్న సమస్యలను జీవన్ రెడ్డి తమ దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ అధిష్టానం జీవన్ రెడ్డికి అండగా ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

### మైనార్టీలకు ప్రభుత్వం
# అండగా ఉంటుంది



**-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**-ధర్మపురి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి**

**చురకలు విలేకరి, ధర్మపురి, మార్చి 21:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు అండగా ఉంటుందని, దేశంలోని సెక్యూలర్ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని దేశ ప్రధానిగా రాహుల్ గాంధీ ని చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం రంజాన్ సందర్భంగా ధర్మపురి నియోజకవర్గ -2లో



# సామరస్యానికి ప్రతీక

**-మానవత్వమే ఈద్ అభిమతం**
**-ఈద్‌గాహ్ షేఖ్ సాలెహ్ సాలేనగర్‌లో ఐక్యత, న్యాయం,**
**-శాంతి, ఈమాన్ పరిరక్షణపై ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ సందేశం**



**కరీంనగర్ మార్చి 21:** సాలేనగర్‌లోని ఈద్‌గాహ్ షేఖ్ సాలెహ్‌లో ఈద్ నమాజ్‌కు ముందు ఖుత్బా ఇస్తూ, ఖతీబ్ ముఫ్తీ మహమ్మద్ గయాస్ ముహియుద్దీన్ ఉర్దూలో విస్తృతంగా ఆలోచనాత్మకంగా ప్రసంగించారు। తన ఉపన్యాసంలో ఈద్ పండుగ యొక్క అసలు సందేశం ఐక్యత, సోదరభావం మరియు పరస్పర ప్రేమను పెంపొందించడం అని పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ, ఈద్ నమాజ్‌ను మస్జిద్‌లలో కూడా నిర్వహించవచ్చని, అయితే ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ ప్రకారం బహిరంగ ప్రదేశమైన ఈద్‌గాహ్‌లో సమూహంగా నిర్వహించడం ద్వారా ముస్లింలలో ఐక్యత మరియు ఏకత్వం బలపడుతుందని వివరించారు। రంగు, జాతి, వంశం, కుటుంబం అనే తేడాలు లేకుండా అందరూ కలిసి జీవిస్తూ, ఆనందాలను పంచుకోవాలని పిలుపునిచ్చారు.ఈద్-ఉల్-ఫిత్ర్ అనేది రమజాన్ మాసంలో పవిత్ర ఖురాన్ అవతరణకు గుర్తుగా జరుపుకునే పండుగ అని, ఖురాన్ సమస్త మానవాళికి మార్గదర్శకమైన గ్రంథమని తెలిపారు। ఇది శాంతి, న్యాయం -2లో

# తాగునీటి సమస్య లేకుండా చేస్తా



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 21.** చెన్నూరు నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య లేకుండా చేస్తా అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.త్రాగునీటి సమస్య తీర్చడానికి చెన్నూరు పట్టణంలో కోటి 87 లక్షల నిధులతో అమృత్ 2.0 పథకం ద్వారా కుమ్మరి కుంట పునర్జీవ అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు.చెన్నూరు నియోజకవర్గం లో శాశ్వత మంచినీటి కరువును తొలగిస్తాం అని పేర్కొన్నారు..త్రాగునీటిని అందించడానికి చెన్నూర్ నియోజకవర్గంలో 100 కోట్లతో అమృత స్కీమ్ పథకానికి నిధులు మంజూరు అయ్యాయి అని స్పష్టం చేశారు.నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.45 కోట్లతో చెన్నూరుకు మంచి నీళ్లు తీసుకు రావడానికి గోదావరి నుంచి లింక్ కనెక్టివిటీ కి కృషి చేస్తున్నాం అని తెలిపారు.దీని పై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి కలిశా.నిధులు ఇవ్వాలని అడిగాను అన్నారు.త్వరలో చెన్నూరు నియోజకవర్గంలో మంచినీటి కరువు ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## మైనార్టీలకు ప్రభుత్వం

# అండగా ఉంటుంది

**మొదటి పేజీ తరువాయి...** కేంద్రంలో మసీదులు, ఈద్గాల వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మైనార్టీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. పేద మైనార్టీలకు ప్రభుత్వం ద్వారా అందించే రుణాలు ఇప్పించడానికి తనవంతుగా సహకరిస్తానని మంత్రి తెలిపారు. ముస్లిం యువతకు ఉపాధి కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. పేద ముస్లింలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు అర్హులకు రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. మసీదులు ఈద్గాల వద్ద మౌలిక వసతుల కల్పనకు × సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# సామరస్యానికి ప్రతీక

**మొదటి పేజీ తరువాయి...** మరియు సన్మార్గ జీవనాన్ని బోధిస్తుందని చెప్పారు. ఇస్లాంలో న్యాయం యొక్క ప్రాముఖ్యతను వివరించేందుకు, ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలంలో జరిగిన ఒక ప్రసిద్ధ సంఘటనను ఆయన ప్రస్తావించారు। బను మఖ్జూమ్ అనే ప్రభావవంతమైన గోత్రానికి చెందిన ఫాతిమా అనే మహిళ చోరీ చేసినప్పుడు, కొందరు ఆమెకు క్షమాభిక్ష కల్పించేందుకు ప్రయత్నించారు। హజ్రత్ ఉసామా బిన్ జైద్ ద్వారా సిఫారసు చేయగా, ప్రవక్త గారి ముఖం కోపంతో ఎర్రబడింది మరియు "మునుపటి జనులు బలహీనులను శిక్షించి, శక్తివంతులను వదిలేయడం వల్లే నశించారు" అని హెచ్చరించారు। "నా కుమార్తె ఫాతిమా అయినా ఇదే తప్పు చేస్తే, ఆమెపై కూడా అదే శిక్ష అమలు చేస్తాను" అని స్పష్టంగా తెలిపారు। ఈ సంఘటన ఇస్లాంలో న్యాయం అందరికీ సమానమని స్పష్టంగా తెలియజేస్తుంది।ప్రస్తుత ప్రపంచ పరిస్థితులపై స్పందిస్తూ, ముఫ్తీ గయాస్ గారు కొన్ని శక్తులు తమను శాంతి పరిరక్షకులుగా ప్రకటించుకుంటున్నప్పటికీ, వాస్తవానికి అవే ఆఫ్ఘానిస్తాన్, ఇరాక్, సిరియా (షామ్), లిబియా, జపాన్, గాజా, ఫలస్తీన్, వియత్నాం మరియు అనేక ఆఫ్రికా దేశాలను నాశనం చేశాయని పేర్కొన్నారు। కోట్లాది నిరపరాధులను హతమార్చి, నగరాలను శిథిలాలుగా మార్చారని విమర్శించారు। అయినప్పటికీ తాము శాంతి దూతలమని చెప్పుకోవడం అసత్యమని, వాస్తవానికి వారు దమనకాండ మరియు క్రూరత్వానికి ప్రతీకలని అన్నారు।అన్యాయం ఎప్పటికీ నిలవదని, అది చివరికి అంతమవుతుందని ఆయన తెలిపారు। నేటి ప్రపంచానికి నిజమైన శాంతి అత్యవసరమని, ఆ శాంతి సందేశం కేవలం ఇస్లాంలోనే ఉందని చెప్పారు। ప్రపంచంలో శాంతి నెలకొల్పడానికి ఇస్లాం సందేశాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని, దౌర్జన్యాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు।ఇదే సందర్భంలో ముఫ్తీ గయాస్ గారు భవిష్యత్ తరాల ఇమాన్ (విశ్వాసం) పరిరక్షణపై కూడా దృష్టి సారించారు। ప్రస్తుత కాలం నాస్తికత్వం, మతద్రోహం మరియు ధర్మం పట్ల విరక్తి పెరుగుతున్న కాలమని పేర్కొన్నారు। "న్యూ ఎడ్యుకేషన్ పాలసీ" వంటి పేర్లతో ఒక ప్రణాళికాబద్ధంగా ముస్లింల ధర్మం మరియు విశ్వాసాన్ని బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు।కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇస్లామీయ విశ్వాసాలకు విరుద్ధమైన మతబోధనలు జరుగుతున్నాయని, ముఖ్యంగా కొన్ని ప్రభుత్వ సంస్థల్లో షిర్క్‌కు సంబంధించిన బోధనలు ప్రోత్సహించబడుతున్నాయని అన్నారు। తల్లిదండ్రులు మరియు సమాజం మొత్తం తమ పిల్లల ఇమాన్‌ను కాపాడేందుకు జాగ్రత్తగా ఉండాలని, దీనిపై గంభీరంగా ఆలోచించాలని పిలుపునిచ్చారు।ఇమాన్ అనేది అత్యంత విలువైన సంపద అని, అది లేకపోతే ఈ ప్రపంచంలోని అన్ని వరాలు వ్యర్థమని ఆయన అన్నారు। పరలోకంలో జన్నత్‌లో ప్రవేశం ఇమాన్‌పై ఆధారపడిందని పేర్కొంటూ, భవిష్యత్ తరాల విశ్వాస పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు।చివరగా, ముఫ్తీ మహమ్మద్ గయాస్ ముహియుద్దీన్ గారు అందరికీ ఈద్ శుభాకాంక్షలు తెలియజేసి, సమాజంలో శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వం మరియు ఇమాన్‌పై స్థిరత్వం నెలకొనాలని ప్రార్థించారు।

# ఏంటి.. ఇలా కూడా దొరికిపోతారా? వింత నేరాలు!

ఆధునిక డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ, నేరాల స్వరూపం కూడా మారిపోతోంది. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే నేరగాళ్లను పట్టించేది వారి ప్రణాళికల కంటే, వారు చేసే చిన్న చిన్న తప్పిదాలే. అమెరికాలోని మిన్నెసోటా రాష్ట్రంలో 2014 జూన్ 19న జరిగిన నికోలస్ విగ్ కేసు దీనికి స్పష్టమైన ఉదాహరణగా నిలిచింది. ఒక ఇంట్లో చొరబడి నగలు, నగదు దొంగిలించిన 26 ఏళ్ల నికోలస్, అక్కడి కంప్యూటర్‌ను చూసి ముచ్చటపడి, తన సోషల్ మీడియా ఖాతాలో లాగిన్ అయ్యాడు. తన ఫేస్‌బుక్ నోటిఫికేషన్లు చూసుకునే ఆత్రుతలో, పని ముగిసిన తర్వాత లాగ్ అవుట్ చేయడం మర్చిపోయాడు. ఇంటి యజమాని జేమ్స్ వుడ్ తిరిగి వచ్చి చూసేసరికి కంప్యూటర్ స్క్రీన్‌పై దొంగ ఫోటో, పూర్తి వివరాలు ప్రత్యక్షమయ్యాయి. వెంటనే యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు నికోలస్ ఇంటికి వెళ్లి మరీ అరెస్ట్ చేశారు. ఈ సంఘటన అంతర్జాతీయంగా "వరల్డ్స్ డంబెస్ట్ క్రిమినల్" గా నిలిచింది. ఒకవైపు సైబర్ నేరాలు అత్యంత క్లిష్టంగా మారుతున్న కాలంలో, ఇంకొవైపు ఇలాంటి చిన్న పొరపాట్లు నేరగాళ్లను సులభంగా పట్టించే పరిస్థితి ఒక విరుద్ధ వాస్తవాన్ని చూపిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా, జాగ్రత్త లేకపోతే అదే మనపై తిరుగుతుందని ఈ సంఘటన స్పష్టం చేస్తోంది. దొంగ తనే తనను ఆన్‌లైన్‌లో బయటపెట్టుకున్న తీరు నేటి డిజిటల్ వ్యసనానికి పరాకాష్ట.

**బ్రాండ్ మోజు.. నేరగాడి బలహీనతే చట్టానికి బలం**

చైనాలోని జెజియాంగ్ ప్రావిన్స్‌లో 2018 ఆగస్టులో జరిగిన ఒక బైక్ దొంగతనం సంఘటన నేరగాళ్లలోని విచిత్రమైన మానసికతను వెలికితీసింది. ఒక వ్యక్తి అత్యంత ఖరీదైన లగ్జరీ బైక్‌ను దొంగిలించాడు, అయితే ఆ బైక్ పాత మోడల్ అని, దాని పనితీరు తన 'స్టేటస్'కి సరిపోదని భావించాడు. సాధారణంగా దొంగలు దొంగిలించిన వస్తువును ఎవరికీ తెలియకుండా దాచిపెడతారు లేదా తక్కువ ధరకు అమ్ముకుంటారు. అయితే ఈ ఘనుడు ఆ పాత బైక్‌ను ఒక సెకండ్ హ్యాండ్ డీలర్‌కు అమ్మేశాడు. వచ్చిన ఆ కొద్దిపాటి సొమ్ముకు తన దగ్గర ఉన్న మరికొంత డబ్బును కలిపి, నేరుగా అదే కంపెనీ షోరూమ్‌కు వెళ్లి సరికొత్త మోడల్ బైక్ కొనుగోలు చేయడం అతని అతి విశ్వాసాన్ని సూచిస్తుంది. షోరూమ్ సిబ్బందికి అతను ఇచ్చిన నగదు మూలంపై, అతని ప్రవర్తనపై అనుమానం రావడంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. విచారణలో అతను అంతకుముందు చేసిన దొంగతనం గురించి నోరు విప్పాల్సి వచ్చింది. ఇది మనిషి తన కోరికలపై, ముఖ్యంగా బ్రాండెడ్ వస్తువుల పట్ల ఉన్న మోజుపై నియంత్రణ కోల్పోతే, ఎంత తెలివిగా ప్రణాళిక వేసినా ఉపయోగం ఉండదని నిరూపిస్తుంది. నేరగాడి సొంత అభిరుచే అతడిని జైలు పాలు చేసిన ఉదంతం నేర చరిత్రలో ఒక నవ్వు పుట్టించే అధ్యాయంగా నిలిచిపోయింది. చట్టం ముందు ఎంతటి బ్రాండ్ మోజు ఉన్నా అది రక్షణ ఇవ్వదు, నేరస్తుడిని నవ్వులపాలు చేస్తుంది.

**గూగుల్ మ్యాప్స్ రివ్యూ.. దొంగ అసంతృప్తి తెచ్చిన ముప్పు**

నేరగాళ్ల అతి తెలివికి మరో మచ్చుతునక 2020లో యూకే లో జరిగిన ఒక వింతైన సంఘటన. ఓ నేరస్థుడు ఒక రెస్టారెంట్‌లో దొంగతనానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. ఆ రెస్టారెంట్ సెక్యూరిటీ సిస్టమ్ చాలా పటిష్టంగా ఉండటంతో అతనికి ఏమీ దొరకలేదు. ఆ కోపంతో అతను ఇంటికి వెళ్లి, సదరు రెస్టారెంట్ సర్వీస్ బాలేదంటూ గూగుల్ మ్యాప్స్‌లో వన్-స్టార్ రేటింగ్ ఇచ్చాడు. అంతటితో ఆగకుండా "ఇక్కడ సెక్యూరిటీ చాలా తక్కువగా ఉంది, కష్టపడి లోపలికి వెళ్తే గల్లా పెట్టెలో డబ్బులు కూడా సరిగ్గా లేవు, టైమ్ వేస్ట్" అని రివ్యూ రాశాడు. సైబర్ పోలీసులు ఆ రివ్యూ ఇచ్చిన అకౌంట్ ఐడీని ట్రేస్ చేసి, కొద్ది గంటల్లోనే అతడిని అరెస్ట్ చేశారు. సాధారణంగా దొంగలు తమ జాడ దొరక్కుండా జాగ్రత్తపడతారు, కానీ ఇక్కడ దొంగ తన 'కస్టమర్ ఫీడ్‌బ్యాక్' ఇవ్వడం ద్వారా పోలీసులకు పని సులభం చేశాడు. ఈ సంఘటన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపై ప్రజలకు ఉన్న అవగాహనను, నేరగాళ్ల అవివేకాన్ని స్పష్టం చేస్తోంది. నేరం చేసి మౌనంగా ఉండకుండా, ఆన్‌లైన్‌లో తన అసంతృప్తిని వెళ్లగక్కడం అతడిని అడ్డంగా పట్టించింది. ఇది నేటి 'సోషల్ మీడియా' యుగంలో నేరస్తులు కూడా తమ అస్తిత్వాన్ని చాటుకోవాలనే తాపత్రయానికి నిదర్శనం.

**నేరంలోనూ మానవత్వం.. విరుద్ధ దృశ్యాల మధ్య విచారణ**

మెక్సికోలో 2012 నవంబర్‌లో జరిగిన ఒక కిడ్నాప్ కేసు నేర ప్రపంచంలో ఒక విభిన్న కోణాన్ని బయటపెట్టింది. ఒక ప్రముఖ వ్యాపారిని అపహరించిన కిడ్నాపర్లు, విచారణలో అతనికి తీవ్రమైన మధుమేహం ఉందని తెలుసుకున్నారు. సాధారణంగా కిడ్నాప్ కేసుల్లో బాధితులకు ఇబ్బందులు కలిగించడం, శారీరక హింసకు గురి చేయడం సహజం. కానీ ఈ సంఘటనలో మాత్రం కిడ్నాపర్లు బాధితుడి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చాలా పద్ధతిగా వ్యవహరించారు. అతనికి సమయానికి ఇన్సులిన్ ఇంజెక్షన్లు ఇవ్వడం, తక్కువ చక్కెర ఉన్న ఆహారం అందించడం వంటి చర్యలు తీసుకోవడమే కాకుండా, అతని ఆరోగ్యం క్షీణించకుండా వైద్యుల సలహాల ప్రకారం నడుచుకున్నారు. పోలీసులు కిడ్నాపర్ల స్థావరంపై దాడి చేసి బాధితుడిని విడిపించినప్పుడు, అతను కిడ్నాప్ సమయంలో అంతకుముందు కంటే ఆరోగ్యంగా ఉండటం చూసి వైద్యులే ఆశ్చర్యపోయారు. ఇది వినడానికి కొంచెం విచిత్రంగా, హాస్యంగా అనిపించినా, నేరగాళ్లలో కూడా కొంతమంది మానవత్వపు లక్షణాలు లేదా తమ డిమాండ్లు నెరవేరే వరకు బాధితుడిని క్షేమంగా ఉంచాలనే 'ప్రొఫెషనల్' బాధ్యత కలిగి ఉంటారని సూచిస్తుంది. అయితే ఇది నేరాన్ని ఎంతమాత్రం సమర్థించదు, కానీ మనిషి పరిస్థితులు ఎలా ఉన్నా, అతని అంతర్గత విలువలు పూర్తిగా అంతరించిపోవని ఇది చూపిస్తుంది.

**టెక్నాలజీతో 'ప్రాంక్' ఆట.. పోలీసులకే సవాల్**

లండన్ నగరంలో 2019 జనవరిలో జరిగిన ఒక సంఘటన డిజిటల్ యుగంలో నేరగాళ్ల ధోరణిని స్పష్టంగా చూపించింది. సాథర్లాండ్ అనే నేరస్థుడు పోలీసులను మభ్యపెట్టేందుకు వారి కార్యకలాపాలను వీడియోగా చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. అతను మారువేషంలో నేరుగా పోలీస్ స్టేషన్ సమీపంలోనే తిరుగుతూ, పోలీసులు తనను పట్టుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను రికార్డ్ చేసి "నన్ను పట్టుకోవడం మీ వల్ల కాదు" అనే శీర్షికతో సవాల్ విసిరాడు. ఆ వీడియో లక్షలాది వ్యూస్ సాధించడంతో పాటు ప్రజల్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే, అతి తెలివి అతడికి ఎంతో కాలం రక్షణ ఇవ్వలేదు. వీడియోలోని లొకేషన్ వివరాలు, డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ ఆధారంగా పోలీసులు కొద్ది రోజుల్లోనే అతడిని ట్రేస్ చేసి అరెస్ట్ చేశారు. ఇక్కడ హాస్యం ఏమిటంటే పోలీసులను ఆటపట్టించాలనుకున్న వ్యక్తి, తనే తనకు వ్యతిరేకంగా ఆధారాలు సృష్టించుకున్నాడు. నేటి కాలంలో ప్రతి డిజిటల్ చర్య ఒక రికార్డ్‌గా నిలుస్తుందనే కనీస జ్ఞానం లేకపోవడం వల్లే ఇలాంటి వింత సంఘటనలు జరుగుతున్నాయి. పోలీసులకు ప్రాంక్ ఇవ్వాలనుకున్న ప్రయత్నం చివరకు అతడికి ఊచలు లెక్కపెట్టే పరిస్థితిని తెచ్చింది. ఇది డిజిటల్ యుగంలో నేరం ఎంత ప్రమాదకరమో, అలాగే అవివేకంగా వ్యవహరిస్తే ఎంత త్వరగా బయటపడుతుందో స్పష్టం చేస్తోంది.

**కుక్కలకు 'లంచం'.. దొంగ అమాయకపు ప్లాన్**

జర్మనీలోని హాంబర్గ్ నగరంలో 2015 మార్చిలో జరిగిన ఒక సంఘటన నేరగాళ్ల వింత ఆలోచనలను బయటపెట్టింది. ఒక దొంగ వరుసగా ఇళ్లలో దొంగతనం చేసి, ఆ వస్తువులను తన ఇంటి వెనుక ఉన్న తోటలో దాచిపెట్టాడు. పోలీసులు స్నిఫర్ డాగ్స్ (స్నిఫర్ కుక్కలు) సాయంతో తన ఇంటికి వస్తారని ముందుగానే ఊహించిన అతడు, ఆ కుక్కల దృష్టి మరల్చడానికి ఒక వింత ప్లాన్ వేశాడు. దారంతా ఖరీదైన మాంసం ముక్కలు, బిస్కెట్లు, ఇతర ఆహార పదార్థాలు చల్లాడు. కుక్కలకు 'లంచం' ఇస్తే అవి ఆహారానికి ఆశపడి తనను పట్టించుకోవు అని, లేదా తన యజమానుల మాట వినవని అతను అమాయకంగా భావించాడు. అయితే అత్యున్నత శిక్షణ పొందిన ఆ పోలీస్ ల కుక్కలు మాంసం ముక్కలను కనీసం కన్నెత్తి కూడా చూడకుండా నేరుగా నేరస్థుడిని, అతను దాచిన సొమ్మును కనిపెట్టాయి. పోలీస్ కుక్కలకు కూడా లంచం ఇవ్వొచ్చు అని భావించే దొంగల అతి తెలివి పోలీసులను సైతం నవ్వించింది. నేర పరిశోధనలో శాస్త్రీయ శిక్షణ ముందు ఇలాంటి చిల్లర ప్రయత్నాలు పనిచేయవని ఈ సంఘటన నిరూపించింది. జంతువుల విశ్వసనీయతను తక్కువ అంచనా వేయడం నేరగాళ్లు చేసే అతిపెద్ద పొరపాటు. చివరికి ఆ మాంసం ముక్కల ఖర్చు కూడా దండగే అయ్యి, అతను జైలు పాలయ్యాడు.

**నేరం కంటే నాటకం ఎక్కువ!**

ఇక ఇండియా విషయానికి వస్తే 2021 సెప్టెంబర్‌లో జరిగిన లాకప్ సంఘటనలో కానిస్టేబుల్ తన విధిని విస్మరించి ఖైదీతో పేకాట ఆడడం కూడా చట్ట వ్యవస్థలోని లోపాలను బయటపెట్టింది. రాత్రి పూట బోర్ కొడుతుందని చెప్పి నిందితుడిని బయటకు తీసి మరీ ఆటలాడటం పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణారాహిత్యానికి నిదర్శనం. ఈ సంఘటనలన్నీ ఒకే విషయాన్ని చెబుతున్నాయి. నేరం ఎంత ప్రణాళికతో చేసినా, ఏదో ఒక చిన్న పొరపాటు దానిని కూల దోయగలదు.

## జీవన్ రెడ్డి పార్టీలోకి వస్తారంటే భుజాలపై మోసుకోస్తా..

**-కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 21:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీలోకి వస్తారంటే తన భుజాలపై మోసుకోస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శనివారం కోరుట్లలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీనియర్ నేత జీవన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని తాను చూడలేదని, బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే తాను ఆయనతో మాట్లాడుతానన్నారు. నేటి రాజకీయాల్లో జీవన్ రెడ్డి లాంటి నాయకులు లేరని, ఆయనంటే తమకు ఏనలేని గౌరవం ఉందని, మచ్చలేని నాయకుడిగా జీవన్ రెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో పేరుపొందారన్నారు. ఆయన బిఆర్ఎస్లోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామన్నారు.

## దేవుడు శాసిస్తే.. మానవుడు అనుసరిస్తాడు..

**-భవిష్యత్తుపై తన అనుచరులతో చర్చిస్తా..**

**-ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 21 :** దేవుడు శాసిస్తే.. మానవుడు అనుసరిస్తాడని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో భేటి అయిన అనంతరం జీవన్ రెడ్డి తన అనుచరులతో సమావేశమై పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడు శాసిస్తే...మానవుడు అనుసరిస్తాడని, త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణపై అనుచరులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటానని ప్రకటించినట్లు సమాచారం. అయితే మంత్రులతో భేటి అయిన అనంతరం జీవన్ రెడ్డి తాను కాంగ్రెస్ పార్టీలో కొనసాగలేనని వ్యాఖ్యానించారు. మంత్రుల సమావేశ అనంతరం జీవన్ రెడ్డి నివాసం వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అక్కడే ఉన్న ఓ కాంగ్రెస్ కార్యకర్త మంత్రులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డికి కౌలుకు ఇచ్చారా అని, ఈ రోజు తమ నాయకుడికి వచ్చిన గతి రేపు మీ అందరికి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు.

## ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు



**చురకలు ప్రతినిధి, ఎండపల్లి, మార్చి 21:** పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా జరుపుకునే ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని శుక్రవారం ఎండపల్లి మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. గుల్లకోట, శాఖపూర్, జగదేవ్ పేట్, అంబారీపేట, పాతగూడూర్ గ్రామాల్లోని ఈద్గాల వద్ద తెల్లవారుజామునే ముస్లిం సోదరులు తరలివచ్చి సామూహిక నమాజ్ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్లు పవిత్ర ఖురాన్ సందేశాలను వివరిస్తూ మానవత్వం, సహనం, దాతృత్వం, సోదరభావం వంటి విలువలను ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనాలని, దేశం అభివృద్ధి చెందాలని ప్రార్థనలు చేశారు. నమాజ్ అనంతరం ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. పలు చోట్ల 'జకాత్-ఉల్-ఫితర్' పేరుతో పేదలకు దానధర్మాలు నిర్వహించారు. చిన్నారులు, యువకులు కొత్త దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈద్గాలను సందర్శించి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రభుత్వం తరఫున తోఫాలు పంపిణీ చేశారు. ఈ వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాయని స్థానికులు పేర్కొన్నారు.

# రంజాన్ పండగ సందర్భంగా ప్రతిష్ఠ భద్రత బందోబస్తు





**చురకలు ప్రతినిధి కోరుట్ల , మార్చి,21,::--** రంజాన్ పండుగ సందర్భంగా కోరుట్ల పట్టణంలోని ఈద్గా వద్ద జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ పర్యటించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేట్ పల్లి డీఎస్పీ. రాములు, కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్సై చిరంజీవి, మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి,పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పండుగ సందర్భంగా నమాజ్‌కు వచ్చే ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైన నెల అని ఒక నెల పాటు రోజా ఉండి అల్లాహ్ దయ కోసం ప్రార్థనలు చేయడం గొప్ప భక్తి భావం అని అన్నారు. ఈ నెలలో నమాజ్, ఖురాన్ పఠనం, దానం, జకాత్, ఫిత్రా ఇవ్వడం ద్వారా పేదవారికి సహాయం చేస్తారని తెలిపారు. సమాజంలో కుల, మత భేదాలు లేకుండా అందరూ ప్రేమతో జీవించాలని మానవత్వాన్ని గౌరవించాలని ఇస్లాం ధర్మం చెప్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ కోసం కోరుట్ల పట్టణం పరిసర మండలాల నుండి పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్గా వద్దకు తరలివచ్చి నమాజ్ చేశారు. వారి భద్రత కోసం పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు బ్రదర్స్, కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు

# రంజాన్ స్ఫూర్తి సమాజానికి మార్గదర్శకం

**మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్**



**చురకలు విలేకరి, జగిత్యాల, మార్చి 21:** రంజాన్ స్ఫూర్తి సమాజానికి మార్గదర్శకమని జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. శనివారం రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆమె ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ చైర్పర్సన్ జ్యోతి మాట్లాడుతూ రంజాన్ కేవలం ఉపవాసం మాత్రమే కాకుండా, మనసును మార్చుకునే ఆత్మపరిశీలన కాలమని ఆమె పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న విభేదాల మధ్య ప్రేమ, సహనం, పరస్పర గౌరవం మరింత అవసరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో అన్ని మతాల ప్రజలు కలిసి జీవించే సెక్యులర్ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్తాందని ఆమె స్పష్టం చేశారు. రంజాన్ పండగ ఈ విలువలను మరింత బలపరచే అవకాశమని తెలిపారు. పేదలకు చేయూత అందించడం, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉపవాసం ద్వారా క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించుకోవాలని సూచించారు. రంజాన్ సందర్భంగా ప్రజలు మంచి ఆలోచనలు ఆచరణలో పెట్టి, సమాజంలో శాంతి, ఐక్యతను నెలకొల్పేందుకు కృషి చేయాలని ఆడువాల జ్యోతి లక్ష్మణ్ ఆకాంక్షించారు.

# జిల్లాలో ఘనంగా ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు

**-ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు**

**-శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డా.సంజయ్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ప్రజాప్రతినిధుల**







**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 21:** జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా మండలాల్లో శనివారం ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని మంచినీళ్లబావి వద్ద ఈద్గాలో, ఖిల్లాలోని ఈద్గాలో, జామ మసీదులో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మతగురువులు రంజాన్ ప్రాముఖ్యతను వివరించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ఈద్గాలు, మసీదుల వద్ద జగిత్యాల మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు అలాయ్ బలాయ్ చేసుకుంటూ ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ జడ్పి చైర్పర్సన్ దావ వసంత సురేష్, మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, మాజీ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్, ప్రజాప్రతినిధులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు చేసిన అనంతరం షవ్వాల్ నెలవంక కన్పించిన తర్వాత ఈద్ ఉల్ ఫితర్ పండుగ జరుపుకుంటారని, రంజాన్ పండుగ మత సామరస్యానికి నిదర్శనమన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగిత్యాల డిఎస్పీ రఘుచందర్, పట్టణ సీఐ కరుణాకర్, ఎస్ఐలు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వైభవంగా శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి కల్యాణం

### -కమాన్ నిర్మాణానికి భూమి పూజ



**చురకలు విలేకరి, మల్లాపూర్, మార్చి 21 :** మండలంలోని గుండంపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం శనివారం వైభవోపేతాంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కృష రావు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కాగా డాక్టర్ రేగొండ రాజేశ్, విజయ హాస్పిటల్ తరుపున ఆలయ కమాన్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అలాగే కృష్ణ రావు ఆలయం వరకు మిగిలిన సీసీ రోడ్డు పూర్తి చేయడానికి కృషి చేస్తానని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్న భక్తులకు వీడీసీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డప్పుల పద్మ, నర్సయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడపుల పుష్ప లత, నర్సయ్య, గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దీక్షిత ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి అడ్లూరి



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, మార్చి 21.** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు ఆసుపత్రిని శనివారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. డాక్టర్ శివాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీక్షిత హాస్పిటల్ ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడు తూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటు లో ఉండటం అవసరమన్నారు. తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి నిర్వాహకులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకు లు, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఓమౌజయః ప్రజ్ఞాన క్షేత్రాన్ని దర్శించుకున్న నాయకులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 21 :** ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురం గ్రామ శివారులోని ఓమో జయః ప్రజ్ఞాన క్షేత్రంలో ఉగాది సందర్భంగా గత మూడు రోజులుగా జరుగుతున్న యజ్ఞ గుండమును శనివారం సాయంత్రం మాజీ జెడ్పిటిసి సభ్యులు చీటీ లక్ష్మణరావు, చీటీ రామారావు నాయకులు , బండారి బాల్రెడ్డి, గుర్రాల రాజిరెడ్డి, వంజరి ప్రవీణ్ కుమార్, జనార్ధన్ సుధాకర్ రావు , జర్నలిస్టు శ్యామంతుల అనిల్ కుమార్ తదితరులు కలిసి సందర్శించారు. 12 -01- 2024 నుండి 10- 10 2026 వరకు 1003 రోజులు జరిపే విశ్వ కళ్యాణ యజ్ఞ గుండమున దర్శించుకు న్నారు ,ప్రజ్ఞనక్షేత్రంలో ఓమౌజయః గురువుల ఆశీస్సులు వారు స్వీకరించారు,

# జగిత్యాలలో అమానవీయ ఘటన

**-బతికి ఉండగానే వ్యక్తిని శ్మశానంలో వదిలేసిన కుటుంబ సభ్యులు**

**-స్థానికుల సమాచారంతో బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లిన 108 సిబ్బంది**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 21:** రోజురోజుకూ మానవ సంబంధాలు కనుమరుగైపోతున్నాయి. ఒకప్పుడు కుటుంబంలో ఎవరికైనా సమస్య వచ్చిందంటే వెంటనే కుటుంబ సభ్యులు మేమున్నామని ధైర్యం చెప్పి భరోసాగా నిలిచేవారు. కొండంత అండగా ఉండేవారు. కాలక్రమేణా ఈ సంబంధాలు కనిపించకుండా పోతున్నాయి. జీవితాంతం తోడుంటామని పెళ్లి పీటలపై ప్రమాణం చేసి వివాహం చేసుకున్న భార్య భర్తను వదిలేస్తోంది. అన్నదమ్ముల మధ్య ఆస్తులకోసం వివాదాలు పెరిగి దాడులు చేసుకుని కేసులు పెట్టుకుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఇలా నిత్యం ఏదో చోట ఇలాంటివి జరుగుతూనే ఉన్నాయి. తాజాగా అలాంటి తరహా ఘటనే జగిత్యాలలో జరిగింది. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని కుటుంబ సభ్యులే శ్మశానవాటిలో వదిలివెళ్లిన అమానవీయ ఘటన జగిత్యాల జిల్లాలో చోటుచేసుకుంది. కొంతమంది స్థానికులో చొరవతో అతడిని 108 సిబ్బంది వచ్చి ఆస్పత్రికి తరలించారు. బతికుండగానే శ్మశానవాటికలో వదిలేశారు : స్థానికుల కథనం ప్రకారం పట్టణంలోని మంచినీళ్లబావి ప్రాంతానికి చెందిన ఎండ్రికాయల శ్రీధర్(49)అనే వ్యక్తికి భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించేందుకు ఉపాధి కోసం అయిదేళ్ల కిందట సౌదీ అరేబియా వెళ్లిన శ్రీధర్ ఓ కంపెనీలో పని చేశారు. ఆ సమయంలో వేతనం ఎక్కువగానే ఉన్నప్పటికీ విలాసాలకు అలవాటు పడ్డారు. ఈక్రమంలోనే కుటుంబ సభ్యులను పట్టించుకోవడం మానేశారు. దీంతో గత్యంతరం లేక కుటుంబాన్ని పోషించేందుకు ఇక్కడ సునీత కూలీనాలీ పనులు చేస్తూ పిల్లలను పోషించారు. మూత్రపిండాలు దెబ్బతిని, తీవ్రఅనారోగ్యానికి గురై : ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన నేపథ్యంలో శ్రీధర్‌ను అతడు పనిచేస్తున్న కంపెనీ స్వదేశానికి పంపింది. ఇంటికి వచ్చాక ఆయనకు కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్యచికిత్సను అందించారు. మూత్రపిండాలు(కిడ్నీలు) దెబ్బతిని తీవ్ర అనారోగ్యానికి గురైన శ్రీధర్‌ను ఆయన కుటుంబసభ్యులు గురువారం రాత్రి పట్టణంలోని చింతకుంట శ్మశానవాటికలో వడిచిపెట్టి వెళ్లారు. అలా రాత్రంతా అక్కడే పడి ఉన్న శ్రీధర్ను శుక్రవారం మధ్యాహ్నం అటువైపుగా వెళ్తున్నవారు గమనించారు. ఆయన పరిస్థితి చూసి చలించి వెంటనే 108 సిబ్బందికి ఈ సమాచారాన్ని చేరవేశారు. ఓ వ్యక్తి శ్మశానవాటికలో పడి ఉన్నారని తెలిపారు. దీంతో హుటాహుటిన వారు వచ్చి బాధితుడిని అంబులెన్స్లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. దీనిపై శ్రీధర్ను ప్రశ్నించగా సోదరుడు, భార్య తనను పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. కాగా ఆయన భార్యపిల్లల పోషణను పట్టించుకోవడం లేదని, దీంతోనే వారు గాంధీనగర్లో ఉన్న సునీత పుట్టింటికి వెళ్లినట్లుగా స్థానికులు వివరిస్తున్నారు. ప్రస్తుతం శ్రీధర్కు జిల్లా ఆస్పత్రిలో వైద్యులు వైద్యచికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం అతనికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. పోలీసుల దర్యాప్తులో మరిన్ని విషయాలు తేలాల్సి ఉంది. ప్రస్తుతం శ్రీధర్ కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నారో తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. వారి ఆచూకీ లభిస్తే వారికి కౌన్సిలింగ్ చేసే అవకాశం ఉంది.

# మెహరాజ్ ఖాన్‌కు ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 21:** కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన మైనార్టీ యూత్ నాయకుడు మేహరాజ్ ఖాన్ ను ముస్లిం మైనార్టీ నాయకులు ఘన సన్మానం చేశారు. మెహరాజ్ ఖాన్ రంజాన్ నెల లో కమాన్ పూర్, రొంపి కుంట, గుండారం ఉపవాస దీక్షలు ఉన్న ముస్లిం సోదరులకు పూర్తి నెల ఇఫ్తార్ కొరకు వివిధ రకాల పండ్లు ఫలాలు అందజేయడం జరిగింది. నెల రోజులపాటు అందజేసిన మెహరాజ్ ఖాన్ ను గుండారం, కమాన్ పూర్ మైనార్టీ ముస్లింలు ఆయనకు శాలువాతో సత్కరించి పూలమాల వేశారు. మత పెద్దలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమాన్పూర్ జామ మజీద్ మౌలానా షోయబ్ ఆలం, ఎం ఏ ఖాలిక్, షోకత్, కమాన్ పూర్ ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీక్ సోహెల్,లతీఫ్, నిజాముద్దీన్, సోను, మెహరాజ్ ఖాన్, అహ్మద్, సద్దాం, తాజ్,లల్లు,నయీమ్, అతిక్, వాజిద్, నదీమ్, ముజాహిద్, గౌస్, ఆఫ్రోజ్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

## సోదరభావంతో మెలగడమే రంజాన్ సందేశం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 21 :** సోదరభావంతో మెలగడమే రంజాన్ సందేశమని బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా ఛైర్ పర్సన్ దాసరి ఉష అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని చందపల్లి ఈద్గాను సందర్శించి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు ముగించుకున్న ముస్లిం సోదరులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి, మత సామరస్యానికి గొప్ప నిదర్శనమని పేర్కొన్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి, లోక కల్యాణం కోసం ప్రార్థనలు చేయడం అభినందనీయమన్నారు. ఆమె వెంట నాయకులు అలువాల రాజేందర్, ఎండి.మాలిక్, మురుమూరి శేఖర్, గాజుల రమేష్, మేరుగు సాగర్, ఎనగందుల నిరంజన్, ఆముదాల అరుణ, మచ్చ రాహుల్, కల్వల చరణ్, అజీమ్, ఖలీల్, అబ్బు, రజనీకాంత్, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

## మరణానంతరం మహాదానం..!



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 21.** గోదావరిఖని తిరుమల నగర్ కు చెందిన గుడెల్లి చంద్రశేఖర్ (41) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. బీఎస్సీ ఎంఎల్టీ పూర్తి చేసిన ఆయనకు ఉద్యోగం దొరకక ఇంటివద్దనే ఉంటుండేవారు. అకస్మాత్తుగా జరిగిన మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదం లో మునిగిపో యారు. ఇలాంటి దుఃఖ సమయంలో కూడా మానవతా దృక్పథంతో ముందుకొచ్చిన కుటుంబం.. చంద్రశేఖర్ నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకుంది. నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని, చంద్రశేఖర్ కళ్ళు సజీవంగా ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయని శ్రీ కోదండ రామాలయం కమిటీ చైర్మన్, 53వ డివిజన్ కార్పొరేటర్ గట్ల రమేష్ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు

# తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం





**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 21:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమ నిధికి ప్రత్యేక కేటాయింపులు చేయకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( టి యు డబ్ల్యూ -హెచ్ -143) నేషనల్ కౌన్సిల్ మెంబర్ అంకరి ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తగరపు శంకర్ విమర్శించారు. జర్నలిస్టుల సంక్షేమ విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్ మానవతా దృక్పథంతో వెన్నుదన్నుగా నిలుస్తోందని ఆశపడితే నిరాశే ఎదురైందని అన్నారు. జర్నలిస్టుల పట్ల, జర్నలిస్టుల సంక్షేమం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేనట్లు కనిపిస్తుంది అన్నారు. పాత్రికేయులకు సంబంధించి సంక్షేమ నిధిపై బడ్జెట్ లో పొందుపరచకపోవడం సరైనది కాదన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని చెబుతూ వచ్చిన తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టులను విస్మరించడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో అదనంగా జర్నలిస్టుల కోసం 100 కోట్లు సంక్షేమ నిధిని కేటాయిస్థాని చెప్పి ప్రస్తుతం బడ్జెట్లో ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం మోసపూరితమన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న పాత్రికేయుల రంగం పట్ల వివక్షతను పెంచుకోవడం మానుకోవాలన్నారు. అదేవిధంగా చాలాకాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంపై కూడా ప్రభుత్వం ఎలాంటి ప్రస్తావన చేయకపోవడంపై విచారకరమన్నారు. బడ్జెట్లో జర్నలిస్టులకు ఎలాంటి సంక్షేమ నిధి కోసం కేటాయింపులు చేయకుండా కల్లబొల్లి ప్రకటనలు చేస్తూ పాత్రికేయులను తెలంగాణ ప్రభుత్వం మోసం చేస్తుందని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు పలుమార్లు కోరినా హెల్త్ కార్డు సంబంధించిన అంశమే బడ్జెట్ ప్రసంగంలో లేక పోవడం విడ్డూరంగా ఉందని వారు పేర్కొన్నారు.. దీనిని బట్టి చూస్తే జర్నలిస్టులకు ఆరోగ్య భద్రతను అందించే జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ను ప్రభుత్వం శాశ్వతంగా రద్దు చేసే ఆలోచనలో ఉన్నట్లు అనుమానం కలుగుతుందన్నారు. ఇది తెలంగాణ జర్నలిస్టులకు పూర్తిగా అన్యాయం చేసిన బడ్జెట్ గా భావిస్తున్నట్లు టి యు డబ్ల్యూ జే నాయకులు అంకరి ప్రకాష్ ,తగరపు శంకర్ అభిప్రాయపడ్డారు.పాత్రికేయుల సంక్షేమ పట్ల ప్రభుత్వ వైఖరి వ్యతిరేకంగా ఉందని స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి మౌనంగా వ్యవహరించడం వెనక ఆంతర్యం ఏంటి అని ప్రశ్నించారు. జర్నలిస్టుల హక్కులను కాపాడుకోవడం కోసం అల్లం నారాయణ నాయకత్వంలో తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ చూస్తూ ఊరుకోదని,రాష్ట్ర రాష్ట్రవ్యాప్తంగా పోరుబాట చేస్తామని వారు హెచ్చరించారు.

# హుజురాబాద్ పట్టణంలో ఘనంగా రంజాన్ వేడుకలు



**చురకలు విలేఖరి హుజురాబాద్, మార్చి, 20:** పట్టణంలో రంజాన్ వేడుకలను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు,ఈ సందర్భంగా పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లింలందరూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత గురువు ముఫ్తీ షాకీర్ రంజాన్ పండుగ ప్రాముఖ్యతను విశిష్టతను వివరించారు,ఖురాన్‌లో చెప్పిన విషయాలను తూచా తప్పకుండా ప్రతి ముస్లిం పాటించాలన్నారు,పేదలకు సాయం చేయాలని,ప్రజలందరూ ధనిక పేద తేడా లేకుండా పండుగ ప్రతి ఒక్కరూ పండుగ జరుపుకోవాలని తెలిపారు,ప్రార్థన అనంతరం చిన్నా పెద్ద తేడా లేకుండా ముస్లింలు ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు,అనంతరం పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా జామే మస్జిద్ ఈద్గా & ఖబరస్తాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా షామియానా,సౌండ్ సిస్టం ఏర్పాటు చేసినందుకు హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని గారికి మరియు మున్సిపల్ పాలకవర్గానికి మరియు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మరియు సిబ్బందికి అలాగే పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసిన హుజురాబాద్ ఏసిపి మాధవి గారికి మరియు సీఐ కరుణాకర్ గౌడ్ మరియు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు,ఈ సందర్భంగా ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలలో మత గురువు ముఫ్తీ షాకీర్, జామే మజీద్ ప్రధాన కార్యదర్శి మరియు కమిటీ సభ్యులు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు ప్రోత్సాహం అందిస్తాం



**చురకలు ప్రతినిధి, హనుమకొండ మార్చి 21 :** విజయ తెలంగాణ డెయిరీ పాలను వినియోగదారులకు మరింత చేరువచేసే చర్యలో భాగంగా శుక్రవారం సాయంత్రం హనమకొండ అలంకార దగ్గర విజయ డైయిరీ కార్యాలయంలో సంబందించిన వివరా లను వివరిస్తూ స్టాండర్డ్ పాలు (4.5% ఫ్యాట్ , 8.5% ఎస్ ఎన్ ఎఫ్) ను కొత్తగా ప్రారంభించారు. అన్ని రకాల పాలు, పెరుగు ప్యాకెట్లపై నిర్దిష్టమైన ధర, బ్యాచ్ సంఖ్యలను లేజర్ ప్రింటింగ్ విధానంలో ముద్రించడం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాడి రైతుల అసోసియేషన్ అధ్యక్షులు ఇరుకు దేవేందర్ రావు , పాల ఉత్పత్తిదారుల అధ్యక్షులు నరేందర్ , గోపాల్ , ఇతర గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు. డెయిరీ ఉపసంచాలకులు డాక్టర్ కె. శ్రవణ్ కుమార్ , మేనేజర్ దశ్రు నాయక్ , జూనియర్ మేనేజర్ పి. అశోక్ కుమార్ ,అకౌంట్స్ సూపరింటెండెంట్ భవాని , సేల్స్ మేనేజర్ డి. రజిత , ప్లాంట్ ఆపరేటర్ ఎస్. మణి , ల్యాబ్ అసిస్టెంట్ రాణి తదితర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ కొత్త విధానం ప్రారంభంతో వినియోగదారులకు మరింత నాణ్యమైన పాలు , పాల ఉత్పత్తులు అందించడంతో పాటు, ఉత్పత్తులపై స్పష్టమైన వివరాలు అందుబాటులో ఉండటం వల్ల పారదర్శకత ,విశ్వసనీయత పెరుగుతుందని తెలిపారు. పాడి రైతులకు మరింత ప్రోత్సాహం లభించి, వారి ఆదాయం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.పాల రవాణా టెండర్ ప్రకటన,అన్ని పాల శీతలీకరణ కేంద్రాల పరిధిలో పాల రవాణా రూట్లకు టెండర్లు ఆహ్వానించబడినట్లు తెలిపారు. టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఆసక్తి గల వారు ఉపసంచాలకులు, వరంగల్ పాల పరిధి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఉపసంచాలకులు తెలిపారు.

## 25న క్రీడ పాఠశాలలకు ఎంపిక



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 21:** కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఈనెల 25న క్రీడా పాఠశాలల ఎంపిక నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి ఇల్లందుల విజయకుమార్ శనివారం తెలిపారు. కమాన్ పూర్ మండలంలోని ప్రభుత్వ ఆమోదిత ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు 4వ తరగతిలో క్రీడా పాఠశాలలో చేరేందుకు ఎంపిక నిర్వహించడం జరుగుతుందని విజయకుమార్ పేర్కొన్నారు. క్రీడా పోటీలకు హాజరయ్యే విద్యార్థులు మూడో తరగతి పూర్తి చేస్తూ 1-9-2017 నుండి 31- 8-2018 మధ్యలో జన్మించి ఉండాలి అని పేర్కొన్నారు. హాజరయ్యే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్ ఆధార్ కార్డ్ పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు కుల ధ్రువీకరణ పత్రము తీసుకొని హాజరుకావాలని సూచించారు. పాల్గొనే అంశాలు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, 610 మీటర్ల పరుగు, మెడిసినల్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సీబిలిటీ టెస్ట్, ఎత్తు బరువు నిర్వహించబడును. కావున విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## మజీద్ కు ఎల్ఈడీ లైటును అందజేసిన దాసరి శివ



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 21:** రామగిరి మండలం బేగంపేటలోని మజీద్ పరిసరాలు చీకటిగా ఉన్నాయని స్థానిక ముస్లిం పెద్దలు కాంగ్రెస్ నాయకుడు దాసరి శివ దృష్టికి తీసుకురాగా అధిక సామర్థ్యం కలిగిన ఎల్ఈడీ లైటును శనివారం అందజేశారు.కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు దాసరి శివ రుద్రవేణ మల్లేష్ ఊదరి రమేష్ కుంట బక్కయ్య అనవేన రాయమల్లు దుర్కి కొమురయ్య బర్పటి కొమురయ్య దాసరి శ్రీనివాస్ గుడెల్లి సురేష్ అనవేన మల్లయ్య రేగల్ల భరత్ కోరకొప్పుల ప్రేమ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## రాళ్ల వానలు పడొద్దని ముడుపు కట్టిన రైతులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మార్చి 21 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రావి చెట్టు హనుమండ్ల ఆలయంలో ఇవాళ ముడుపును రైతు చర్చ మండలి అధ్యక్షులు గుండం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి కట్టారు.. పండించిన వరి పంటలపై రాళ్లవానలు, అకాల వర్షాలు పడకుండా మొక్కి ముడుపును కట్టడం జరిగిందని పేర్కొన్నారు.. ప్రతి ఏటా ముడుపును కట్టడం జరుగుతుందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ రాచర్ల హనుమాన్ల శర్మ సర్పంచ్ ఎలగందుల నరసయ్య, ఉపసర్పంచ్ బందారపు బాలిరెడ్డి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారాలను అందుకున్న తాటికొండ శంకర్

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్: మార్చి 21 :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల సిద్దిపల్లి మాజీ సర్పంచ్, పద్మశాలి మంథని నియోజక వర్గ నాయకులు తాటికొండ శంకర్ ని శనివారం ఉగాది పురస్కార అవార్డును అనుకున్నారు. హైదరాబాద్ లో పద్మశాలి చేనేత రాష్ట్ర ఐక్యవేదిక, పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో సినీ నటుడు బాబు మోహన్ చేతుల మీదుగా తాటికొండ శంకర్ ని సన్మానించి ఈ పురస్కారాలను అందజేశారు.తెలంగాణా చేనేత పద్మశాలి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్, తెలంగాణ పద్మశాలి సంఘ రాష్ట్ర అధ్యక్షులు వాళ్ళకటి రాజకుమార్, డీస్పీ చిలుకూరు వెంకటేశ్వర్లు, ఆర్గనైజర్లు ఇప్పలపల్లి రమేశ్, పాల్గొన్నారు.

# ప్రపంచ సమస్యగా మారనున్న మంచి నీటి ఎద్దడి !

(22 మార్చి "ప్రపంచ నీటి దినోత్సవం" సందర్భంగా)

జీవులకు ప్రాణాధారం జలం. భూగ్రహంపై జీవకోటి ఉనికికి కారణం ద్రవరూపంలో ఉన్న నీరు మాత్రమే. అతి ముఖ్య సార్వత్రిక ద్రావణిగా జలధారలు భూఉపరితలంపై నిరంతరం ప్రవహిస్తానే ఉన్నాయి. భూమిపై ఉన్న జల సంపదలో అత్యధిక మొత్తం సముద్ర జలం రూపంలో లేదా హిమానీనదాలు లేదా గ్లేసియర్స్ రూపంలో ఉండడంతో పాటు కేవలం 3 శాతం మాత్రమే మంచి నీటి జలంగా మానవాళికా అందుబాటులో ఉంటున్నది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి తీవ్రమైన నీటి కొరత లేదా నీటి ఒత్తిడిని అనుభవిస్తున్నది. నేడు మార్కెట్‌లో నీటిని పాల వలె అధిక ధరలకు కొనుక్కోవలసిన అగత్యం ఏర్పడింది. రానున్న కొన్ని దశాబ్దాల్లో నీటి కొరత ఎక్కువై దేశాలు, ప్రాంతాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో దాదాపు 2.2 బిలియన్ల ప్రజలకు సురక్షిత నీరు అందడం లేదు. రాను రాను నీటి కొరత పెరిగి గొంతులు ఎండిపోయే ప్రమాదం కూడా ఏర్పడనుందని అర్థం అవుతున్నది. మంచి నీటి వనరుల్లో నదులు, చెరువులు, సరస్సులు, వాగులు వంకలు, భూగర్భ జలాలు లాంటి నీటి నిల్వలు వస్తాయి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–6 ప్రకారం "2030 నాటికి అందరికీ నీరు – పారిశుద్ధ్యం" అనే లక్ష్యం సుసాధ్యం అయ్యేట్లుగా కనిపించడం లేదు. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ – పరిశ్రమలకు నీటి అవసరాలు పెరగడంతో రానున్న రోజుల్లో ప్రపంచ మానవాళి నీటి ఒత్తిడి సంక్షోభంలో పడే విధంగా కనిపిస్తున్నది.



**హిమానీనదాల పరిరక్షణే తక్షణ కర్తవ్యం:** తాగు నీరు, సాగు నీరు, పరిశ్రమలు, జన విద్యుత్ కేంద్రాలు, ఉత్పత్తి రంగాలు జల వనరులను అత్యధికంగా వినియోగించుకుంటున్నాయి. ప్రాణికోటి మనుగడకు కారణమైన నీటి కొరతను అధిగమించడానికి ప్రజలకు నీటి ఆవశ్యకత పట్ల తగు అవగాహన పెంచాల్సిన అవసరం ఏర్పడుతున్నదని గమనించిన ఐరాస ప్రతి ఏట 22 మార్చిన "ప్రపంచ నీటి దినోత్సవం లేదా వరల్డ్ వాటర్ డే"ను 1993 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది. నేటి పర్యావరణ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పులు, కార్బన్ ఉద్గారాల పెరగడం, హరిత గృహ వాయువులు అధికం కావడం, భూతాపం పెరగడం లాంటి కారణాలతో హిమానీనదాలు లేదా గ్లేసియర్లు వేగంగా కరుగుతూ తరుగుతూ రానున్న ప్రమాద హెచ్చరికగా మారనున్నాయి. గ్లేసియర్లు వేగంగా కరగడం వల్ల సముద్ర మట్టాలు పెరగడం జరిగి మానవాళికా మరో ప్రమాద ఘంటికలు మోగించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. హిమానీనదాల పరిరక్షణ కేంద్రంగా నేటి మానవాళి తన దృష్టిని పెట్టవలసి ఉందనే విషయాన్ని పరిగణలోకి తీసుకొని 2026 ప్రపంచ నీటి దినం ఇతివృత్తంగా "వాటర్ అండ్ జెండర్ – నీటి ప్రవాహంతో లింగ సమానత్వం" అనబడే అంశం కేంద్రంగా అవగాహన కలిపించడం జరుగుతున్నది.

**అంతర్జాతీయ హిమానీనదాల సంవత్సరం:** హిమానీనదాల పరిరక్షణే ఏకైక లక్ష్యంగా చేసుకొని 2025 ఏడాదిని "అంతర్జాతీయ హిమానీనదాల సంవత్సరం"గా కూడా ప్రకటించు తగు ప్రచార కార్యక్రమాలను నిర్వహించుటకు భారీ ఏర్పాట్లు చేయడం జరిగింది. అదే విధంగా ప్రప్రథమంగా 2025, మార్చి 21న "ప్రపంచ గ్లేసియర్స్ దినం" కూడా నిర్వహించడం జరిగింది. క్రియోస్ఫియర్, వాతావరణ మార్పులు, నీటి చక్రం, ఆర్థికాభివృద్ధి, పర్యావరణం, పౌర సమాజాల మధ్య నెలకొని ఉన్న సంబంధాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతున్నది. నీరు ద్రవ రూపంలో కాకుండా ఘన మంచు రూపంలో అధికంగా ఉన్నపుడు దాని ప్రతికూల ప్రభావం భూమిపై పడుతుంది. దీనితో పాటు 2025–34 దశాబ్దాన్ని కూడా "క్రియోస్ఫియరిక్ సైన్సెస్ చర్యల దశాబ్దం"గా ప్రకటించడం జరిగింది. ఇదే క్రమంలో నీరు – పారిశుద్ధ్యాలకు సంబంధించిన నివేదికను "వాటర్ టవర్స్ : మౌంటేన్స్ అండ్ గ్లేసియర్స్" అనబడే పేరుతో విడుదల చేయడం జరిగింది.

**హిమానీనదాలను రక్షించుకునే మార్గాలు:** భూతాపం పెరిగిన కొద్దీ హిమానీనదాలు క్రమంగా, వేగంగా కరుగుతూ తరిగిపోతున్నాయి. అధిక మొత్తంలో హిమానీనదాలు కరిగితే వరదలు, కొండచరియలు విరిగి పడడం, సముద్ర మట్టాలు పెరగడం, కరువు కాటకాలు రావడం, జీవ వ్యవస్థల్లో లోపాలు జరగడం లాంటి ప్రతికూలాలు అనుభవంలోకి వస్తాయి. 2023లో గ్లేసియర్స్ కరగడం వల్ల 600 గీగాటన్నుల నీరు వ్యర్థంగా ప్రవహిస్తున్నది. భూగోళంపై ఉన్న మంచి నీటిలో 70 శాతం వరకు మంచు రూపంలోనే ఉంటున్నది. గ్లేసియర్స్ కరగడంతో 1900 నుంచి నేటి వరకు దాదాపు 20 సెమీ సముద్రమట్టం పెరగడం గమనించారు. భూతాపాన్ని తగ్గిస్తేనే గ్లేసియర్స్ కరిగే వేగం అదుపు చేయబడి ఉంటుందని తెలుసుకోవాలి. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ నివేదిక "సహజ వనరుల కొరత" ఆధారంగా విడుదల చేయబడింది. రానున్న రోజుల్లో అతి ముఖ్యమైన కొరత ప్రమాదాల్లో 4వ స్థానం నీటి ఒత్తిడి గుర్తించబడింది. నీరు తాగడానికి, పారిశుద్ధ్యానికి, వ్యవసాయానికి, పరిశ్రమలకు మాత్రమే కాకుండా పర్యావరణ సమతుల్యత కాపాడడంలో కూడా ఉపయోగపడుతుంది. ప్రపంచ నీటి దినం వేదికగా నీటి వనరులను కాపాడడంతో పాటు హిమానీనదాల వేగవంతమైన కరగడాన్ని కూడా తగ్గించడానికి ప్రజలకు పలు మార్గాల్లో ప్రచారాలు పెద్ద ఎత్తున నిర్వహించాల్సింది ఉన్నది. హిమానీనదాలను రక్షించుకుంటూ రాబోయే తరాలకు సుజల వాతావరణం కల్పిద్దాం, నీటిని చుక్క చుక్క సద్వినియోగం చేసుకుందాం.

## పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ విజ్జన్న



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 21:** ముస్లిం సోదర సోదరిమణులకు తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని చందపల్లి వద్ద గల ఈద్గా సమీపంలో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగను పురస్కరించుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన అనంతరం నెలరోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగను ముస్లిం సోదరులు తమ కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈద్–ఉల్–ఫితర్ సందర్భంగా ముస్లిం సోదరులు అల్లా దీవెనలు నిండుగా అందుకోవాలని ఎమ్మెల్యే విజయరమణ రావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ.. మతసామరస్యానికి తెలంగాణ రాష్ట్రం నిలువెత్తు నిదర్శనం అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా నెలరోజుల కఠిన ఉపవాస దీక్షతో క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, దాతృత్వం, ప్రేమ, దయ, సోదర భావం ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, మైనారిటీ సోదరులు, మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు...

## ఉగాది పురస్కారాలను అందుకున్న పద్మశాలి సంఘం నేతలు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 21 :** కమాన్ పూర్ మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు, రొంపికుంట మాజీ సర్పంచ్ కుందారపు బాపు, సిద్దిపల్లె మాజీ సర్పంచ్, పద్మశాలి మంథని నియోజక వర్గ నాయకులు తాటికొండ శంకర్, పద్మశాలి సంఘం మండల నాయకులు బత్తుల సమ్మయ్య, మెరుగు వెంకటేష్ పద్మశాలి ఉగాది పురస్కారాలను అందుకున్నారు. శనివారం హైదరాబాద్ లో పద్మశాలి చేనేత రాష్ట్ర ఐక్యవేదిక, పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో సినీ నటుడు బాబు మోహన్ చేతుల మీదుగా వారు ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా చేనేత పద్మశాలి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్, తెలంగాణ పద్మశాలి సంఘ రాష్ట్ర అధ్యక్షులు వాళ్ళకటి రాజకుమార్, డీస్పీ చిలుకూరు వెంకటేశ్వర్లు, ఆర్గనైజర్లు ఇప్పలపల్లి రమేశ్, మార్తా రమేష్, బత్తుల రాజు తో పాటు అధిక సంఖ్యలో పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## సీసీ రోడ్ కు నిధులు మంజూరు.. బండి సంజయ్ కృతజ్ఞతలు



**చురకలు విలేఖరి వీణవంక మార్చి 21:** వీణవంక మండల పరిధిలోని బేతిగల్ గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ చొప్పరి సారమ్మ గ్రామ ప్రజలు బిజెపి పార్టీ సర్పంచ్ గా గెల్పించినందుకు కృతజ్ఞతగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ గ్రామంలో 15లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు సీసీ రోడ్డు కు మంజూరు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కి బేతిగల్ గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సీసీ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్ మాట్లాడుతూ.. మండలంలోని సర్పంచులు గెలిచిన గ్రామాలకు ప్రత్యేక దృష్టితో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆ గ్రామాలు అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉన్నారని తెలిపారు. బూత్ అధ్యక్షులు ఐలయ్య , రాజేశ్వరరావు,రాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హెల్త్ స్కీమ్ అమలు

# ప్రకటన స్వాగతిస్తున్నాం



**మంథని, మార్చ్ 21:** ఉద్యోగుల హెల్త్ స్కీం అమలు ప్రకటనను స్వాగతిస్తున్నామని పి ఆర్ టి యు టి ఎస్ పునర్నిర్మాణ కమిటీ స్టేట్ కన్వీనర్ కర్రు సురేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు అనుకూలంగా మార్పులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నగదు రహిత ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయుల నుండి ఆరోగ్య పథకం కోసం ప్రతినెల వారి వేతనం నుండి రూ 500 కు మినహాయింపు పరిమితం చేయాలని తెలిపారు. వైద్య నిపుణులతో కూడిన సభ్యులు ఉన్న ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

## కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతన బ్యారక్ ప్రారంభం

### పోలీసుల సంక్షేమమే ధ్యేయం: సిపి గౌష్ ఆలం



**కరీంనగర్ రూరల్:** పోలీసు సిబ్బంది వసతి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన మెన్ మరియు ఆఫీసర్స్ బ్యారక్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిపి మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల విధుల్లో రూరల్ పోలీస్ సిబ్బంది అంకితభావంతో పనిచేసి శాంతిభద్రతలను కాపాడారని కొనియాడారు. సిబ్బంది సౌకర్యార్థం ఈ బ్యారక్ నిర్మాణాన్ని అత్యంత వేగంగా పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకువచ్చిన రూరల్ సిఐ ఎ. నిరంజన్ రెడ్డిని, ఇతర సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**పాల్గొన్న అధికారులు:** ఈ కార్యక్రమంలో ఏసిపి విజయ్ కుమార్, ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారి సోహం సింగ్, రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా బొప్పాపూర్ రాచర్ల కోట దాస ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం





**ఎల్లారెడ్డిపేట న్యూస్.:** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని రాచర్ల కోట లోని దాసాంజనేయ ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది.గ్రామంలోని గ్రామ పంచాయతీ పాలక వర్గం,ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు,చందన సమర్పణ,ఆకుపూజ తదితర పూజాదికాలు ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి ,ఉప సర్పంచ్ కొండాపురం వెంకటరెడ్డి తో పాటు వార్డు సభ్యులు ,గ్రామ వార్డు సభ్యులు,అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని శివ పరాశక్తి పీఠం పీఠాధిపతి మనోహర్ రాజు గురూజీ కుటుంబ సభ్యులు సర్పంచ్ దంపతులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గ్రామస్థులకు, భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## ముస్లింలను పట్టించుకోని బిఆర్ఎస్ ప్రభుత్వం

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (చెన్నూరు) మార్చి 21.** గత పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడైనా ముస్లిం మైనార్టీలను పట్టించుకోలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం చెన్నూరులో పర్యటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి ముస్లిం మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కుట్టుమిషన్లు ఆర్థికంగా చేయూతకు తోడ్పాడునందిస్తాయన్నారు.మైనార్టీల అభివృద్ధికోసం తమ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.2026 రాష్ట్ర బడ్జెట్ లో ఇందిరమ్మ ఇళ్లకు రూ. 5వేల కోట్లు కేటాయించామన్నారు.సొంత జాగా ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని అన్నారు. చెన్నూరు నియోజకవర్గం సర్వతో ముఖాభివృద్ధి చేస్తానని అన్నారు.

# 27న సీతారామచంద్ర స్వామి కళ్యాణం



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 21 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనం శ్రీ శ్రీ శ్రీ సరస్వతి గోవిందరాజుల చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన అయోధ్యపుర వాసి శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా ఈ నెల 27 వ తేదీ నా వేద బ్రాహ్మణులచే జరపబడుతుందని ట్రస్ట్ అధ్యక్షులు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి తెలిపారు, అట్టి కరపత్రాలను శుక్రవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు, భక్త జనులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణం తిలకించి శ్రీ సీతారామచంద్ర స్వామి కృపకు పాత్రులు కాగలరనికోరారు, ట్రస్ట్ ఆధ్వర్యంలో ముందు ముందు మరెన్నో దైవ కార్యములు నిర్వహించుటకు భక్త మహాశయులు ధన వస్తు రూపేనా 9441925323 విరాళాలు అందించి సహకరించాలని ట్రస్ట్ కోరింది, కళ్యాణ దాతలుగా కూర్చుండే భక్తులు ఆశ్రమంలో సంప్రదించాలని కోరారు .కళ్యాణం అనంతరం మధ్యాహ్నం మూడు గంటల నుండి నాలుగు గంటల వరకు బ్రహ్మశ్రీ పారువెల్ల ఫణి శర్మ శ్రీరామచంద్ర స్వామి గురించి ప్రవచనం చెబుతారు, అనంతరం భక్త జనానికి అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహిస్తారు, కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి గ్రామపురోహితులు బ్రహ్మశ్రీ రాచర్ల దయానంద్ శర్మ కార్యదర్శి శ్రీనివాస్ గుప్త రామ్ రెడ్డి కిషన్ రెడ్డి గంప నాగేంద్ర గుప్తా తోట వేణు గుప్తా ద్యాపదేవయ్య యాదవ్ చకిలం నారాయణ గుప్తా బండారి బాల్ రెడ్డి రాము గుప్తా గంట వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు,

# ఇది సంక్షేమ, అభివృద్ధి బడ్జెట్



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, మార్చి 21 :** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా, పదేళ్ల విధ్వంసం తర్వాత వికాసం కలిగించేలా ఉందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం అయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధి, మౌలిక సదుపాయాలు, ఆరు గ్యారెంటీలు అమలయ్యేలా బడ్జెట్ లో రూపొందించారని, కొత్తగా కుటుంబానికి జీవిత బీమా అందిస్తున్నామని ఇది పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికి సుపరిపాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దానికి అనుగుణంగా బడ్జెట్ ఉందని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ విషయంలో రాష్ట్రాన్ని దేశంలోనే టాప్ గా నిలుపుతున్నారని అన్నారు. ఈ నెల 22న ఆదివారం నుండి రైతు భరోసా నిధులు ప్రభుత్వం విడుదల చేస్తుందని వివరించారు.

## మాజీ సర్పంచ్, రైతునేత 'మూగల సంజీవరెడ్డి' సేవలు మరువలేనివి

### మూగల కుటుంబానికి కాంగ్రెస్ నేత ప్రణవ్ పరామర్శ



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, మార్చి 21:** హుజూరాబాద్ మండలం ధర్మరాజుపల్లిలో ఇటీవల మృతి చెందిన ఆదర్శ రైతు, మాజీ, మొదటి సర్పంచ్ మూగల సంజీవ్ రెడ్డి కుటుంబాన్ని కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ శనివారం పరామర్శించారు. సంజీవ రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. సంజీవ రెడ్డి చిత్రపటం వద్ద ప్రణవ్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సంజీవ రెడ్డి సహకార స్ఫూర్తి మరువలేనిదని అయన నలభై, యాభై ఏళ్ల క్రితమే సహకార రంగం గురించి ఆలోచన చేసారని, రైతుల కోసం పరితపించారని గుర్తు చేసారు. సర్పంచ్ గా గ్రామాభివృద్ధికి కృషి చేసారని, అయన మృతి పూడ్చలేనిదని, మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు.

## హుజురాబాద్‌లో రంజాన్

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మార్చ్ 21:** హుజురాబాద్ లో రంజాన్ వేడుకలను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ సమీపంలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు రాజకీయ పార్టీల నేతలు ఈద్గా కు వెళ్లి ప్రార్థనల అనంతరం వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ఒకరికొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా గ్రామాల్లోనూ రంజాన్ వేడుకలు జరిగాయి.

## ఎస్సై దంపతుల కథ.. విషాదాంతం

### మొన్న భార్య దివ్య.. నిన్న ఎస్సై చంద్రశేఖర్



**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి, హుజురాబాద్):**

చూడముచ్చటైన జంట.. ఇద్దరు ఐదు రోజుల వ్యవధిలోనే ఆత్మహత్యలకు పాల్పడడం పోలీసు శాఖతో పాటు వారి బంధుమిత్రుల్లో విషాదం నింపింది. చంద్రశేఖర్ కరీంనగర్ నగరంలో టూ టౌన్ ఎస్సైగా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు సంతానం. చంద్రశేఖర్ భార్య దివ్య ఐదు రోజుల క్రితం గన్నేరుపప్పు తీసుకుని మృతి చెందింది. అనారోగ్యం బాధపడుతూ దివ్య ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదు చేసారు. దివ్య ఐదోరోజు కార్యక్రమం ఇల్లందకుంట మండలం సీతంపేటలో జరగ్గా.. చంద్రశేఖర్ అక్కడ తన అత్తవారింట్లో ఉరివేసుకుని మృతి చెందడం విషాదం నింపింది. ఈ సంఘటపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. దివ్య మృతికి భర్త చంద్రశేఖర్ కారణమని దివ్య కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు తెలుస్తోంది. దీంతోపాటు చంద్రశేఖర్ ను ఓ గదిలో ఉంచి దివ్య అంత్యక్రియలు చేసినట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అయన ఆత్మహత్యకు పాల్పడడం సంచలనం రేపింది. బాధిత కుటుంబ ఫిర్యాదు మేరకు సి ఐ రామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జీవన గమనాన్ని నేర్పేదే రమజాన్





**చిగురుమామిడి, మార్చి 21:-** జీవన గమనాన్ని నేర్పేదే రమజాన్ మాసం అని, మానవీయ విలువలకు తిలోదాకాలిచ్చిన వారికి, రమజాన్ మాసంలో గడిపే జీవన విధానం చక్కటి ఉదాహరణ అని ఇందుర్తి మహమ్మదియ మస్జీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ అన్నారు. శనివారం ఇందుర్తి ఈద్గాలో ముస్లిం సమాజాన్ని ఉద్దేశించి ముఫ్తి సాదుల్లా సందేశాన్ని వినిపించి, ఈద్ నమాజ్ చదివించారు. ఈ సందర్భంగా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ.. ఇందుర్తి గ్రామంలోని ఈద్గా, ఖబ్రస్థాన్లలో మౌలిక వసతులు కల్పించాలని ఇందుర్తి ముస్లిం స్మశాన వాటికకు ప్రొసీడింగ్ కలెక్టర్ ద్వారా ఇప్పించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కు విజ్ఞప్తి చేశారు. ముస్లింలు జరుపుకునే ‘ఈద్’కు రంజాన్ మాసంతో సంబంధం ఉండటం వల్ల ఈ పండుగ అదే పేరుతో ప్రసిద్ధికెక్కింది. నిజానికి రమజాన్ అన్నది సంవత్సరంలోని పన్నెండు నెలల్లో తొమ్మిదవ నెల పేరు. దీనికింతటి ప్రత్యేకత రావడానికి కొన్ని కారణాలున్నాయి. సర్వ మానవాళికి మార్గదర్శక గ్రంథమైన పవిత్ర ఖురాన్ రమజాన్ మాసంలోనే అవతరించింది. మానవజాతికి జ్ఞానకాంతిని ప్రసాదించే దివ్యజ్యోతి రమజాన్ మాసంలో అవతరించిన కారణంగానే ఈ మాసానికి ఇంతటి గౌరవం, ఘనత, పవిత్రత ప్రాప్తమయ్యాయి. మానవుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి అద్భుతంగా ఉపకరించే ‘రోజా’ అనే ఉపవాస వ్రతాన్ని కూడా దైవం ఈ నెలలోనే విధిగా చేశాడు. ఇది జనహృదయాల్లో భయభక్తులు జనింపజేసి, మానవీయ విలువలను, సుగుణాలను పెంపొందిస్తుంది. పాపకార్యాలు, దుర్మార్గాల వైపుకు మనసు పోకుండా కాపాడుతుంది. ఉపవాసం వల్ల సహనశక్తి పెరుగుతుంది. జాలి, దయ, కరుణ, త్యాగం, పరోపకారం లాంటి సద్గుణాలు అలవడతాయి. స్థితిపరులు ఉపవాసం పాటిస్తే, పేదసాదల ఆకలి బాధను వారు అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఇలా మరెన్నో మానవీయ, నైతిక సుగుణాలను మానవుల్లో పెంపొందింపజేసే ఏర్పాటును చేసిన విశ్వప్రభువుకు కృతజ్ఞతగా నెల రోజుల ఉపవాసాలను ముగించి షవ్వాల్ మొదటి తేదీన ఈద్ జరుపుకుంటారన్నారు. ఈద్గాల వద్ద ముస్లిం సోదరులకు ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలిపి ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు పరస్పరం తెలుపుకున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్నలిస్టు గాదె రఘునాథరెడ్డి ఇందుర్తి ఈద్గాలో ముస్లింలను కలుసుకొని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు ఉస్మాన్ పాషా, ఎక్బాల్, సిరాజ్, అప్సర్, శంషీర్, ఉమ్మర్, నవాబ్, ఖాసీం, రాజ్ మహమ్మద్, నసిర్, జావిద్, బాబూమియా, చాన్ మియా, అబ్బాస్, మకబూల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేట మండలంలో ఘనంగా రంజాన్ వేడుకలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 21 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మసీదుల్లో ప్రత్యేక నమాజ్ నిర్వహించి అల్లాహ్ కు ప్రార్థనలు చేశారు. పవిత్ర రంజాన్ నెల ముగిసిన సందర్భంగా జరుపుకునే ఈద్ పండుగను గ్రామ ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ”ఈద్ ముబారక్” అంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. గ్రామంలో సామరస్య వాతావరణంలో ఈ వేడుకలు కొనసాగాయి. పెద్దలు యువతకు ఐక్యత, సహనం, దాతృత్వం వంటి విలువలను వివరించారు. రంజాన్ పండుగ ద్వారా సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులను ఏఎం సి చైర్మన్షేక్ సబేరా బేగం గౌస్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య మాజీ జెడ్పిటిసి సభ్యులు చీటీ లక్ష్మణ్ రావు మాజీ సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హరి కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్ రెడ్డి, గుర్రం రాజిరెడ్డి, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు,

# హుజూరాబాద్ గులాబీలో ఏం జరుగుతోంది?

**-ఎమ్మెల్యే కౌశిక్‌కు వ్యతిరేకంగా గళం విప్పుతున్న నేతలు**

**-ఇది టీ కప్పులో తుపానే అంటున్న కౌశిక్ అనుచరులు**

**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి, హుజూరాబాద్):** హుజూరాబాద్ బి ఆర్ ఎస్ పార్టీలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీరుపై అసంతృప్తిగా ఉన్న నేతలు ఓ రిసార్ట్ లో సమావేశం కావడం స్థానిక రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. కౌశిక్ రెడ్డి తమను పట్టించుకోవడం లేదని, సీనియర్ల మాటకు విలువ ఇవ్వడం లేదని, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అయన తీరుతో పార్టీ నష్టపోతుందని పలువురు వాపోతున్నారు. సోషల్ మీడియాకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, అలాగే కుటుంబ సభ్యులను తెరమీదకు తెస్తున్నారని, ఆవేశంతో వెళ్తూ అనవసర వివాదాల్లో ఇరుక్కుంటున్నారని, వ్యక్తిగత అంశాలు పార్టీకి అంటగడుతున్నారని వారు



ఆరోపిస్తున్నారు. అసంతృప్త నేతలు హుజూరాబాద్ పార్టీలో జరుగుతున్న అంశాలను కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు దృష్టికి తీసుకువెళ్లాలని భావిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఏం జరుగుతుందనే ఉత్కంఠ ఆ పార్టీలోనూ... రాజకీయ వర్గాల్లోనూ నెలకొంది.

**అసలు విషయం ఏమిటి?**

హుజూరాబాద్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గెలిచినప్పటికీ.. రాష్ట్రంలో బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి రాకపోవడం మైనస్ గా మారింది. దీంతో అయన నియోజకవర్గానికి అనుకున్న విధంగా నిధులు తేలేకపోతున్నారు. అలాగే అభివృద్ధి విషయంలో అనుకున్న విధంగా ముందుకు వెళ్లలేక పోతున్నారు. సీనియర్లుగా ఉన్న నేతలు తమను పట్టించుకోవడం లేదని భావిస్తున్నప్పటికీ.. కౌశిక్ ఎవరిని దూరం పట్టలేదని, అందరికి ప్రాధాన్యం ఇస్తున్నారని, కొందరిపై వ్యతిరేకత ఉన్న దృష్ట్యా.. మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందారని, దానికి కౌశిక్ రెడ్డిని బాధ్యుడిని చేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అభ్యర్థులకు ఆర్థిక అండదండలు అందించడంతో పాటు ప్రచారం విషయంలోనూ ఎక్కడ తగ్గలేదని, మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో అధికారంలో లేకున్నప్పటికీ ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే.. మంచి ఫలితాలే వచ్చాయని ఎమ్మెల్యే అనుచరులు చెప్తున్నారు. కొందరు కావాలనే ప్రత్యర్థి పార్టీలతో కుమ్మక్కై కౌశిక్ రెడ్డి ని బద్నామ్ చేయాలనే కుట్ర చేస్తున్నట్టుగా వారు ఆరోపిస్తున్నారు. కౌశిక్ రెడ్డికి హైదరాబాద్ లోనూ ఫాలోయింగ్, ఆకర్షణ ఉంది.. ఫంక్షన్లకు ఫ్యామిలీతో వెళ్తే.. వివాదం చేస్తున్నారని వారంటున్నారు. ఇవన్నీ కౌశిక్ రెడ్డిని బదనాం చేసేందుకు జరుగుతున్నా కుట్రలో భాగమని, ఇలాంటి వివాదాలు ప్రతి పార్టీలోనూ ఉంటాయని, సాధారణమని, రాబోయే కాలంలో అన్ని సర్దుకుంటాయని, కొన్ని అంశాల్లో కౌశిక్ రెడ్డి కఠినంగా ముందుకు వెళ్తున్నారని, అది నిజమేనని ప్రత్యర్థుల ట్రాప్లో, మైండ్ గేమ్ లో అయన పడొద్దని, ఫ్లెక్సిబుల్ గా వ్యవహరించాలని, క్షేత్ర స్థాయిలో ఇకపై ఎక్కువ సమయం కేటాయించాలని వారు కోరుతున్నారు. కొంతమంది ఆయనకు ఎమ్మెల్సీ గా విప్ ఆ పార్టీలో చేరడంతోనే అవకాశం ఇచ్చినట్టుగా చెప్తున్నారని, కానీ అయన అదే కాంగ్రెస్ లో ఉంటె.. ప్రస్తుతం రేవంత్ మంత్రి వర్గంలో మంత్రిగా ఉండేవారని, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి 60 వేల ఓట్లు తెచ్చుకున్నారని, పార్టీ అధిష్ఠానం నేతల స్థాయిని బట్టి సందర్భాన్ని బట్టి పదవులు ఇస్తుందంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈటలను ఓడించింది కౌశిక్ రెడ్డే కదా.. ఆనాడు దూకుడే పనిచేసిందని, సందర్భాన్ని బట్టి దూకుడు ప్రదర్శించాలని లేకుంటే.. బి ఆర్ ఎస్ కు మూడోస్థానం వచ్చేందని, ముక్కుసూటిగా మాట్లాడడం కూడా ఆయనకు నష్టం చేస్తోందని వారంటున్నారు. జనంలో క్రెడిబిలిటీ లేని వ్యక్తులకు ప్రాధాన్యం ఇస్తే కూడా ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇకపై తన పంథా మార్చి ప్రజాసమస్యలపై గళమెత్తుతూ.. మరోవైపు కార్యకర్తలతో మమేకం అవుతూ.. అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ.. ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉన్నట్టుగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.